సాక్షి శ్రీకాకుళం

శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



దర్శన కష్టాలు

అరసవల్లిలో దివ్యాంగులకు దర్శన కష్టాలు తప్పడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

- 8లో



బంగారం కోసం..

అదృశ్యమైన వ్యాపారి శవమై తేలాడు. రామిగెడ్డలో మృతదేహం దొరికింది.

- 8లో

పీడీఎస్ బియ్యం పట్టివేత

కొత్తూరు: నివగాంలోని సత్యనారాయణ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 15.100 టన్నుల పీడీఎస్ రైస్‌తో పాటు పికప్ వ్యాన్‌లలో ఉన్న 6.250 టన్నుల రైస్ మొత్తం 21.350 టన్నుల బియ్యాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యప్రకాశరావు గురువారం రాత్రి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. అందిన ఫిర్యాదు మేరకు డీఎస్‌ఓ, స్థానిక సీఎస్‌డీటీ భీమారావు మిల్లును తనిఖ చేశారు.

న్యూస్‌రీల్

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, సహాయక బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పరీక్షలు ఆదివారం జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లపైనా జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 5,186 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని చెప్పారు. ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, సహాయక బీట్ ఆఫీసర్ పరీక్షలు జరుగుతాయని, ఈ విభాగానికి 4,495 మంది అభ్యర్థులు హాజరవుతారని ఆయన చెప్పారు. అలాగే మధ్యాహ్నం 3 నుంచి 5:30 గంటల వరకు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పరీక్ష జరగనుందని ఈ విభాగానికి 691 మంది అభ్యర్థులు హాజరవుతారని పేర్కొన్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ, అభ్యర్థులకు పరీక్షా సమయానికి గంటన్నర ముందు నుండి కేంద్రంలోకి అనుమతి ఉంటుందని తెలిపారు. అయితే, పరీక్షా సమయానికి పావుగంట ముందుగా గేట్లు మూసివేస్తారని చెప్పారు.

టీడీపీ ఎంపీటీసీపై అట్రాసిటీ కేసు నమోదు

కొత్తూరు: కొత్తూరు మండలం కడుము కాలనీకి చెందిన కడుము టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు వలు రౌతు గోవిందరావుతో పాటు వాసుదేవరావు, బూరాడ రామారావు, హిందువర్ధన, శంకరరావులపై అదే కాలనీకి చెందిన మంతెన అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ శుక్రవారం తెలిపారు. అప్పారావు మూడు సెంట్లు స్థలంలో నిర్మించుకుంటున్న ఇంటిలోకి చొరబడి కులం పేరుతో గోవిందరావుతో పాటు ఫిర్యాదులో తెలిపిన ఐదుగురు దూషించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్లాబు నిర్మాణం కోసం వేసిన సెంట్రింగ్ డబ్బాలు కూలగొట్టినట్లు తెలిపారు. అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

మద్యం తాగి వ్యక్తి మృతి

హిరమండలం: స్థానిక గాంధీనగర్ వీధికి చెందిన లోపింటి అప్పారావు గురువారం మద్యం తాగి ఆహారం తీసుకోకపోవడంతో మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. అప్పారావు డప్పు వాయిస్తూ, కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. గురువారం రాత్రి ఎప్పటిలాగే పూటుగా మద్యం తాగి తన ఇంటి సమీపంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనంలో పడి ఉన్నాడు. శుక్రవారం ఉదయం కుమారుడు సింహాచలం వెళ్లి తండ్రిని నిద్రలేపేందుకు ప్రయత్నించినా లేవకపోవడంతో, తక్షణమే 108 వాహనం ద్వారా హిరమండలం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అప్పారావు మృతి చెందాడు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొలాలు వదిలి..



ఎంత సేపు నిలబడాలో..

పొందూరు: మండలంలోని మజ్జిలిపేట, తాడివలస గ్రామాల్లో శుక్రవారం పోలీసుల సమక్షంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు ఒక యూరియా బస్తాను మాత్రమే అందజేశారు. మజ్జిలిపేటలో 158 బస్తాలు, తాడివలసలో 176 బస్తాల యూరియాను రైతులకు అందజేశారు.

రైతుకు పొలం వద్ద ఉండాలో యూరియా కోసం వేచి ఉండాలో అర్థం కావడం లేదు. ఖరీఫ్ పనులు ముమ్మరంగా జరిగే కీలక సమయంలో ప్రభుత్వం బస్తా యూరియా కోసం గంటల తరబడి నిలబెడుతోంది. రైతు సేవా కేంద్రానికి వెళ్లినా, ప్రైవేటు దుకాణానికి వెళ్లినా క్యూలో నిలబడితే గానీ ఎరువు దొరకడం లేదు.

అధికారులతో వాగ్వాదం



ఎరువుల కోసం ఎగబడుతున్న రైతులు

కంచిలి: బూరగాం గ్రామంలో ఎరువుల కోసం రైతులు తీవ్ర ఆందోళన చెందారు. వస్తున్న యూరియా సరిపోకపోవడంతో రైతులు ఉద్యోగులతో వాగ్వాదానికి దిగారు. యూరియా సరఫరా చేసే సచివాలయం ముందు క్యూలు కట్టారు.

పోలీసుల సమక్షంలో..

హిరమండలం: ఎల్‌ఎన్‌పేట మండలం మిరియాబిల్లి రైతు సేవా కేంద్రంలో శుక్రవారం ఎరువుల పంపిణీ జరిగింది. రైతుల నుంచి నిలదీతలు, గందరగోళం ఏర్పడే అవకాశం ఉడడంతో స్థానిక సిబ్బంది సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. దీంతో హెచ్‌సీ మోజేశ్వరరావుతో పాటు సిబ్బంది వచ్చారు.



పోలీసుల సమక్షంలో రైతులకు ఎరువులు అందిస్తున్న దృశ్యం

అన్నీ ప్రకటనలే



టెక్కలిలో ఓ ప్రైవేట్ ఎరువుల దుకాణం వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

టెక్కలి: ఇదిగో యూరియా వచ్చేస్తోంది...అదిగో యూరియా వచ్చేస్తోందంటూ అధికార యంత్రాంగం చేస్తున్న ప్రకటనలు చూసి రైతులు మోసపోతున్నారు. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో యూరియా దొరక్కపోవడంతో మండల కేంద్రాల్లో ప్రైవేట్ డీలర్ల వద్దకు క్యూకడుతున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో టెక్కలిలో శుక్రవారం రైతులంతా యూరియా బస్తాల కోసం ప్రైవేట్ డీలర్ల వద్ద క్యూ కట్టడం కనిపించింది. పోలీసుల పర్యవేక్షణలో యూరియా విక్రయిస్తుండడం గమనార్హం.

ఉత్తరాదికి మన కొబ్బరి



- పండగ వేళల్లో ఉద్దానం కొబ్బరికి కళ
- తగ్గిన దిగుబడి

కంచిలి:

ఉద్దానం కొబ్బరి రైతుల్లో దరహాసం కనిపించింది. చాలా కాలంగా దిగుబడులు తగ్గడంతో పాటు ధరలో కూడా పెద్దగా మార్పు రాకపోవడంతో రైతులు, వ్యాపారులు దిగాలు చెందారు. దీంతో పాటు పక్కనే ఉన్న కోనసీమ, దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున ఉత్పత్తులు పెరగడంతో కంచిలి మార్కెట్ చాలాకాలంగా డీలాపడిన సంగతి తెలిసిందే. కొన్నాళ్లుగా మళ్లీ ఉద్దానం కొబ్బరి కాయకు ధర పెరిగి రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. కేవలం ఒడిశాపైనే ఎగుమతులకు ఆధారపడిన పరిస్థితి చాలా ఏళ్లుగా ఇక్కడ ఏర్పడింది. ఇప్పుడు మళ్లీ ఉద్దానం కాయకు కొద్దిపాటి డిమాండ్ ఏర్పడటంతో ధరలు కూడా ఎగబాకాయి. ఎప్పుడూ దసరా వేళ ధర పెరగడం పరిపాటి. కానీ ఈ సారి వినాయక చవితి ముందుగానే ధరలు పెరిగాయి.

మొదలైన ఎగుమతులు..

ఉద్దానం కొబ్బరి కాయలకు ఉత్తరాది రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. కానీ ఉద్దానంలో వరుసగా వచ్చిన విపత్తులతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఫలితంగా ఉత్తరాదికి ఎగుమతులు క్రమంగా తగ్గి, పక్కనే ఒడిశా మార్కెట్‌కే పరిమితమైంది. టెక్కలి డివిజన్‌లోని ఏడు మండలాలతో పాటు రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం మండలాల్లో కలిపి సుమారు 36వేల ఎకరాల్లో సాగు చేస్తున్న కొబ్బరి ఉత్పత్తుల ఎగుమతులు కంచిలి కేంద్రంగానే సాగుతుండేవి. ఇక్కడి నుంచి ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, హరియాణా, బీహార్, ఒడిశా తదితర రాష్ట్రాలకు కొబ్బరి కాయలు ఎగుమతి చేస్తుండేవారు. కానీ క్రమక్రమంగా పరిస్థితులు తలకిందులయ్యాయి. కొబ్బరి దిగుబడులు స్థానికంగా తగ్గడంతో దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఉత్తరాది వారు కొనేవారు. మళ్లీ ఇన్నాళ్లకు ఉద్దానం కొబ్బరిపై వారి మనసు మళ్లింది. ప్రస్తుతం రైతు నుంచి వెయ్యి కాయలను వ్యాపారులు రూ.26వేల నుంచి రూ.28వేలు వరకు కొనుగోలు చేస్తున్నారు.



లారీల్లోకి లోడ్ చేస్తున్న కొబ్బరి కాయలు

ఎగుమతి జరుగుతోంది



కంచిలి కొబ్బరి మార్కెట్ నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు మళ్లీ మొదలయ్యాయి. ధర పెరగడంతో మార్కెట్‌లో లావాదేవీలు పెరిగాయి.

– కొంచాడ లక్ష్మణ్, కొబ్బరి వ్యాపారి, కంచిలి

ప్రత్యామ్నాయంపై దృష్టిపెట్టాలి



కొబ్బరి రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపైన కూడా దృష్టి సారించాలి. కొబ్బరి దిగుబడులు ఎకరాకు కేవలం 250 నుంచి 300 మాత్రమే దిగుబడి వస్తున్నాయి. గతంలో ఒక ఎకరాకు 800 కాయలు దిగుబడి వచ్చేవి. అలాంటిది పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కొబ్బరితోపాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపైన కూడా దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

– వజ్జ మృత్యుంజయరావు, కొబ్బరి రైతు, మకరాంపురం గ్రామం

దిగుబడుల్లో డీలా..

ధర బాగానే ఉన్నా ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి దిగుబడులు దారుణంగా తగ్గిపోయాయి. గతంలో ఒక ఎకరాకు గరిష్టంగా 800 కాయల వరకు ఉత్పత్తి అయ్యేవి. క్రమంగా ఉత్పత్తి తగ్గిపోయి, చివరకు ఒక ఎకరాకు 250 నుంచి 300 కాయలు మాత్రమే దిగుబడి అవుతున్నాయి. దీంతో ఆ ప్రభావం రైతులు, కూలీలు, వ్యాపారులు, దుకాణదారులు అందరిపై పడింది.

మెడికల్ కాలేజీలపై కూటమి కుట్ర

- ప్రశ్నిస్తానన్న పవన్ కల్యాణ్ ఎక్కడ..?
- వ్యవసాయ శాఖ మంత్రిగా అచ్చెన్నాయుడు అట్టర్ ఫ్లాప్
- ప్రభుత్వ తీరుపై మండిపడిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

శ్రీకాకుళం న్యూకాలనీ: పదిహేనేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు రాష్ట్రానికి ఒక్క మెడికల్ కాలేజీ అయినా తెచ్చారా అంటూ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. ఆయన శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పది మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు నిర్ణయించడం దుర్మార్గమని అన్నారు. పీపీపీ విధానం ద్వారా 10 మెడికల్ కాలేజీలను తన వ్యక్తులకు కట్టబెట్టేందుకు కుట్రకు తెరతీశారని, తద్వారా వేలకోట్లను దోచుకునేందుకు స్కెచ్ వేశారని దుయ్యబట్టారు.

దార్శనికుడు జగన్..

దేశంలో ఎక్కడా లేని విధంగా ఏకంగా 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టిన దార్శనికుడు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనే విషయాన్ని డాక్టర్ సీదిరి గుర్తుచేశారు. గత ప్రభుత్వం హయాంలోనే రూ.2500 కోట్లు ఖర్చు చేసి, 5 మెడికల్ కాలేజీల భవన నిర్మాణాలు పూర్తయ్యి అడ్మిషన్లు మొదలుపెట్టిన విషయం వాస్తవం కాదా ? అని ప్రశ్నించారు. మరో రూ.6వేలు కోట్లు ఖర్చు చేసి 2025–26, 2026–27 నాటికి మిగిలిన 10 కాలేజీల్లో తరగతులు ప్రారంభించేలా ప్రణాళిక చేశారని, కానీ ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయన్నారు. 15 నెలల్లో రూ.2 లక్షల కోట్లు అప్పు చేసిన కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల కోసం రూ.6వేల కోట్లు వెచ్చించలేదా అని ప్రశ్నించారు. అక్రమాలపై ప్రశ్నిస్తానని చెప్పిన పవన్ కల్యాణ్ వారి పంచనే చేరి రుషికొండలో వేషాలు వేస్తున్నారని దుమ్మెత్తిపోశారు. చంద్రబాబు పాలన చీకటి రోజులను తలపిస్తోందన్నారు. ఎవరి లబ్ధి కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రైవేటు పరం చేసి బీమా విధానంలోకి తీసుకువస్తున్నారని ప్రశ్నించారు.

మంత్రిగా తప్పుకో అచ్చెన్నాయుడు..

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా అచ్చెన్నాయుడు జిల్లా పరువు మంటగలుపుతున్నారని అన్నారు. యూరియాను సైతం అందజేయలేని దుస్థితిపై కూటమి ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. పనిచేయడం చేయకాకపోతే వ్యవసాయశాఖ నుంచి తప్పుకో అచ్చెన్నాయుడు అని హితవుపలికారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: గ్రామీణ నిరుద్యోగులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని ట్రస్ట్ ఇన్‌చార్జి ఎం.రామమూర్తి శుక్రవారం తెలిపారు. పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న వైటీసీలో నాలుగు నెలల పాటు ఉచితంగా హాస్టల్, వసతి సౌకర్యం ఉంటుందని, కంప్యూటర్ బేసిక్, ఎంఎస్ ఆఫీస్, స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనల్ డెవలప్‌మెంట్, స్కిల్స్, సోలార్ పీవీ ఇన్‌స్టాల్ కోర్సులకు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. పదో తరగతి పాసై ఉండాలని, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉండాలని, దరఖాస్తు చేసుకోవాలని, 105 సీట్లు మాత్రమే ఉన్నాయని, మరిన్ని వివరాలకు 7416321186 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ట్రస్ట్ ఇన్‌చార్జి రామమూర్తి కోరారు.

ఆ 30 నిమిషాలు..

ముప్పై నిమిషాలు ఆమదాలవలస స్టేషన్ ఉత్కంఠతో ఊపిరి బిగపట్టి చూసింది. నిత్యం రైల్వే అనౌన్స్‌మెంట్లతో మార్మోగే ఆ ప్రాంగణం ఓ నిండు గర్భిణి పురిటి నొప్పులు గమనించింది. సమయానికే స్టేషన్‌కు వచ్చిన రైలు అక్కడే ఆగిపోవడం, నిమిషాలు గడిచిపోతున్నా కదలకపోవడం, ఓ గర్భిణికి రైలులోనే ప్రసవం జరుగుతోందని స్టేషన్ అంతా తెలియడం, పండంటి ఆడపిల్ల పుట్టిందని సమాచారం రావడం వంటి ఘటనలతో ముప్పై నిమిషాలు మూడు ఘడియల్లా గడిచిపోయాయి. కాసింత జాప్యానికే తిట్టుకునే ప్రయాణికులు తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని తెలియడంతో ఆలస్యాన్ని అంతగా పట్టించుకోలేదు.

- ఆమదాలవలస రైల్వే స్టేషన్‌లో రైలులోనే ప్రసవం
- రైల్వే డాక్టర్ చొరవతో తల్లీబిడ్డ క్షేమం
- జెమ్స్ ఆస్పత్రిలో మరో బిడ్డ జననం

ఆమదాలవలస / శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో శుక్రవారం రాత్రి రైలులో ఓ గర్భిణి ప్రసవించారు. ఆర్‌పీఎఫ్ ఎస్ఐ అరుణ, రైల్వే ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ పల్ల కీర్తి తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. ఇచ్ఛాపురానికి చెందిన జి.భూలక్ష్మి అనే గర్భిణి తన భర్త జానకిరామ్‌తో కలిసి విశాఖ వెళ్లేందుకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కారు. దారిలో ఆమెకు పురిటి నొప్పులు రావడంతో శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌లో ఆమె భర్త రైల్వే ఆర్‌పీఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో రైలును స్టేషన్‌లో నిలుపుదల చేసి రైల్వే ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ కీర్తికి సమాచారం అందించారు. ఆమె హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. అప్పటికే నొప్పులు అధికం కావడంతో రైలులోనే ప్రసవంచేశారు. ఆడబిడ్డ జన్మించగా తల్లి గర్భంలో మరో శిశువు ఉన్నట్లు వైద్యురాలు గుర్తించారు. దీంతో వారిని వెంటనే రాగోలు జెమ్స్‌కు తరలించారు. ఆస్పత్రిలో మరో ఆడబిడ్డకు జన్మనిచ్చారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. సంఘటనను రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు అంతా వింతగా గమనించారు. దాదాపు 30 నిమిషాల పాటు రైలును ఆపేశారు.



శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో బిడ్డకు జన్మనిచ్చిన తల్లికి వైద్యసేవలు అందిస్తున్న రైల్వే సిబ్బంది

టీచర్లతోనే బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



చిన్నారుల నృత్య ప్రదర్శన

- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



విజయవాడలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డులు అందుకుంటున్న టీచర్లు తిమ్మరాజు నీరజ, బూరవెల్లి విజయభారతి, కుర్మాన అరుణకుమారి, లెక్చరర్ రుంకు జనార్దనరావు

శ్రీకాకుళం కల్చరల్/ శ్రీకాకుళం న్యూకాలనీ/ జి.సిగడాం /మెళియాపుట్టి: భావితరాలకు బంగారు భవిష్యత్ ఇవ్వగలిగేది ఒక్క ఉపాధ్యాయుడే అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచర్లతో పాటు తల్లిదండ్రులు తమ పిల్లలను తీర్చిదిద్దాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే వారిలో చాలామంది ఆర్థికంగా వెనుకబడిన వారు ఉంటారని వారిని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు టీవీ, సెల్ వాడకంపై నియంత్రణ ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం తాము ఎంతో కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులను అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు, అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.శశిభూషణరావు, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, డైట్ ప్రిన్సిపాల్ గౌరీశంకర్, సాయిప్రసాద్, బెజ్జిపురం యూత్ క్లబ్ నిర్వాహకులు ప్రసాదరావు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీ

మహ్మద్ ప్రవక్త సల్లాహూ సల్లాం 1500వ జయంతి సందర్భంగా శ్రీకాకుళం పట్టణంలో శుక్రవారం భారీగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జీటీ రోడ్డులోని జామియా మసీదు మీదుగా ఏడురోడ్ల కూడలి మీదుగా పాలకొండ రోడ్డు, డే అండ్‌నైట్ కూడలి, రైతుబజారు, రామలక్ష్మణ కూడలి, సూర్యమహల్ మీదుగా తిరిగి జామియా మసీదు చేరుకుంది. ర్యాలీలో ముస్లింలతో పాటుగా చిన్నారులు కూడా పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

క్లుప్తంగా

కార్పొరేట్ గుప్పిట్లో మెడికల్ కాలేజీలు


దుంపల లక్ష్మణరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మెడికల్ కాలేజీలను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైఎస్సార్ సీపీ కళింగ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అందులో పది కాలేజీలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం వల్ల సుమారు 1500 మెడికల్ సీట్లు కోల్పోయే దుస్థితి నెలకొందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో విలేజ్ క్లినిక్స్, అర్బన్ హెల్త్ క్లినిక్స్, 3256 రోగాలను ఆరోగ్యశ్రీలో చేర్చి పేదలకు ఆసరాగా నిలిచారని గుర్తు చేశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అప్రజాస్వామికం


పొన్నాడ రుషి

శ్రీకాకుళం రూరల్: రాష్ట్రంలో పది మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అప్రజాస్వామికమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నాడ రుషి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాడు దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచన విధానం మేరకు ప్రతి ఇంట్లో ఒకరు డాక్టర్ విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అదే పరంపర కొనసాగిస్తూ 2019లో ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు మెడికల్ విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రిమ్స్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న అప్పలనాయుడు

శ్రీకాకుళం: రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎస్.అప్పలనాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మశ్రీ నుంచి బాధ్యతలు చేపట్టారు. అప్పలనాయుడు గతంలో విజయనగరంలో ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతో సమావేశమై కళాశాల వివరాలను తెలుసుకున్నారు.

ఎఫ్‌డీఓకు పదోన్నతి


డి.గోపీకృష్ణ

అరసవల్లి: జిల్లా మత్స్యశాఖలోని ఫిష్ సీడ్ ఫామ్‌లో ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఎఫ్‌డీవో)గా విధులు నిర్వర్తిస్తున్న డి.గోపీకృష్ణకు విజయవాడ కమిషనరేట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్‌నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎఫ్‌డీవోగా సేవలందించిన గోపీకృష్ణకు పదోన్నతి లభించడంపై సిబ్బంది, మత్స్యకారుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు.

వాస్తవికతకు దగ్గరగా 'కన్యాకుమారి'


సక్సెస్ మీట్‌లో చిత్ర యూనిట్‌కు సత్కారం

శ్రీకాకుళం అర్బన్: ఉత్తరాంధ్ర వాస్తవికతకు దగ్గరగా కన్యాకుమారి చిత్రం రూపొందించడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని రామలక్ష్మణ కూడలి వద్ద ఓ హోటల్లో శుక్రవారం 'కన్యాకుమారి' చిత్రం సక్సెస్ మీట్‌ను చిత్ర నిర్మాతల్లో ఒకరైన అట్టాడ అప్పలనాయుడు నిర్వహించారు. చిత్ర నటులు అగ్గున బాబూరావు, జ్యోతి బత్తుల, గిరిజ శంకర్, తిరుమలరావు, సాహితీవేత్తలు కె.శ్రీనివాస్, ఉదయ్‌కిరణ్, న్యాయవాది మామిడి క్రాంతి, దాసరి రామచంద్రరావు, డాక్టర్ సతీష్ కుమార్ తదితరులు హాజరయ్యారు. శ్రీకాకుళం యాస, సంస్కృతి, రైతును హీరోగా చూపడం చిత్రం గొప్పతనమన్నారు. చిత్ర దర్శకుడు అట్టాడ సృజన్‌కు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఈ నెల 17 నుంచి అమెజాన్ ప్రైమ్, ఈటీవీ విన్, ఆహా ఓటీటీల్లోనూ రిలీజ్ అవుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వాన కృష్ణచంద్, ఆగూరు ఉమామహేశ్వరరావు, కొమ్ము రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దర్శన కష్టాలు!

- ఆదిత్యుని సన్నిధిలో కానరాని 'ప్రత్యేక' ఏర్పాట్లు
- ఆలయ స్థాయి పెరిగినా తీరు మారని వైనం

అరసవల్లి : ప్రత్యక్ష దైవం సూర్యనారాయణుడు కొలువుదీరిన అరసవల్లిలో స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన దివ్యాంగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రత్యేక ఏర్పాట్లు కానరాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. సాధారణ రోజులను పక్కన పెడితే ఆదివారం ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఆ సమయంలో దివ్యాంగులు క్యూలైన్ల వద్ద నరకయాతన అనుభవిస్తున్నారు. ఇనుప గ్రిల్స్‌కు ఆనించుకుని నిలబడి కృత్రిమ కాలు (ఆర్టిఫిషియల్ లెగ్)ను అమర్చుకోవడంతో పాటు కేశఖండన శాలలో తలనీలాలను తీయించుకున్న తర్వాత పైపుల వద్ద నిల్చుని స్నానాలకు ఆగచాట్లు పడుతున్నారు. మరుగుదొడ్లలో కూడా దివ్యాంగులకు తగిన ఏర్పాట్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయం ముందు వరకు వెళ్తే మాత్రం నాలుగైదు వీల్‌చైర్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. వాటిలో ఆదిత్యుని మహామండపం వరకు మాత్రమే వెళ్లేందుకు అనుమతిస్తున్నారు. దీంతో దూరం నుంచే ఆదిత్యున్ని దర్శించుకుని వెనుదిరగాల్సి వస్తుంది. ఆదిత్యుని ఆలయానికి వార్షిక ఆదాయం రూ.20 కోట్ల వరకు చేరడంతో డిప్యూటీ కమిషనర్ (డీసీ) హోదా పొందిన సంగతి విదితమే. అయినప్పటికీ అంతటి స్థాయిలో ఏర్పాట్లు లేకపోవడంపై స్థానికులు, భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

'ప్రత్యేక' ఏర్పాట్లు చేయాలి..

ఆదిత్యాలయానికి దివ్యాంగులు దర్శనాలకు అధికంగా వస్తున్నారు. వీరికి ఆలయంలో తగిన ఏర్పాట్లు లేకపోవడంతో దూరం నుంచి దర్శనం చేసి వెళ్లిపోవాల్సి వస్తుంది. ఇది మినహా మరే ఇతర ఆర్జిత సేవల్లోనూ పాల్గొనే అవకాశాలు లేకుండాపోతున్నాయనే ఆవేదన దివ్యాంగుల్లో వ్యక్తమవుతోంది. ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలకు, కళ్యాణ సేవలకు, తలనీలాల మొక్కులు చెల్లింపులకు, అన్నప్రసాదాల స్వీకరణకు కూడా ఎలాంటి 'ప్రత్యేక' ఏర్పాట్లు లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ఆలయ అధికారులు, పాలకులు దృష్టి సారించి దివ్యాంగులకు 'ప్రత్యేక' దర్శనం కల్పించాలని కోరుతున్నారు.


దివ్యాంగులను దర్శనానికి తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

- కాళ్లు, చేతులు కోల్పోయిన వారు, అంధత్వమున్న దివ్యాంగులకు ప్రత్యేక దర్శన మార్గం (క్యూలైన్లు) ఏర్పాటు చేయాలి.
- దివ్యాంగులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు నిర్మించాలి. స్నానాల గదులతో పాటు కింద అంతస్థులోనే వసతి ఉండేలా చూడాలి.
- ఇంద్రపుష్కరిణి సమీపంలోనే తలనీలాల మొక్కులు చెల్లించుకునేందుకు..అక్కడికి సమీపంలోనే దివ్యాంగులు స్నానాలకు వీలుగా తక్కువ ఎత్తులో పైపులైన్లు ఏర్పాట్లు చేయాలి.
- దర్శనానికి వచ్చే మార్గంలో దివ్యాంగులు వచ్చే వాహనాలకు అనుమతివ్వడంతో పాటు ప్రత్యేకంగా ఆలయ సిబ్బందిని కనీసం ఆదివారం నాడైనా డెప్యూట్ చేయాలి.
- ఆర్జిత సేవల్లో దివ్యాంగులు పాల్గొనేలా సౌకర్యాలు కల్పించాలి. కనీసం గంట సమయం పట్టే సూర్యనమస్కారాల పూజల్లో పాల్గొనేందుకు వీలైన సౌకర్యాలు కల్పించాలి.
- ఉదయం ఆలయంలో ఉచిత ప్రసాదాల స్వీకరణకు, మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని తీసుకునేందుకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి.

వీల్‌చైర్లను వినియోగిస్తున్నాం..



దివ్యాంగుల దర్శనాలకు ప్రస్తుతానికి వీల్‌చైర్లను వినియోగించి దర్శనాలకు పంపుతున్నాం. రద్దీ సమయాల్లో వీఐపీ మార్గంలోనే పంపిస్తున్నాం. ఇప్పటివరకు శాశ్వత మరుగుదొడ్లు, అన్నదాన మండపాలేవీ నిర్మాణాలు కాలేదు. భవిష్యత్ నిర్మాణాల్లో కచ్చితంగా దివ్యాంగులకు సౌకర్యవంతమైన ఏర్పాట్లతోనే కొత్త నిర్మాణాలు చేపడతాం. స్టాఫ్ లేకపోవడంతో ప్రత్యేక సిబ్బంది కేటాయింపు సమస్యగా మారింది. – కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్, ఆలయ ఈవో, అరసవల్లి


స్నానానికి దివ్యాంగుడి పాట్లు

బంగారం కోసమే బలిగొన్నారా?

- వీడిన నరసన్నపేట వ్యాపారి అదృశ్యం మిస్టరీ
- పెదపాడు రామిగెడ్డలో లభ్యమైన మృతదేహం
- పోలీసుల అదుపులో నిందితులు!


వెంకట పార్వతీశం గుప్తా(ఫైల్)

శ్రీకాకుళం రూరల్: నరసన్నపేటకు చెందిన బంగారం వ్యాపారి వెంకట పార్వతీశం గుప్తా(45) అదృశ్యం మిస్టరీ ఎట్టకేలకు వీడింది. శ్రీకాకుళం రూరల్ పరిధిలోని పెదపాడు వద్ద రామిగెడ్డలో శుక్రవారం ఉదయం 11 గంటలకు గుప్తా మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. బంగారం కోసమే ఈ హత్య జరిగినట్లు పోలీసులు, స్థానికులు అనుమానిస్తున్నారు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి..

నరసన్నపేటకు చెందిన గుప్తా బంగారాన్ని హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తూ నరసన్నపేటతో పాటు శ్రీకాకుళంలోని పలు షాపులకు విక్రయించేవారు. ఈయన వద్ద డ్రైవర్ సంతోష్ ఐదేళ్లగా పనిచేస్తున్నాడు. గుప్తా వద్ద బంగారం కాజేయాలనే ఉద్దేశంతో సంతోష్ తన స్నేహితుడు కార్ డెకార్స్ యజమాని రాజుతో కలిసి ప్లాన్ వేశాడు.

ఆ రోజు ఏం జరిగిందంటే..

ఆగస్టు 26న విశాఖపట్నంలోని ఓ బంగారం దుకాణం వద్ద కేజీన్నర బంగారాన్ని గుప్తా కొనుగోలు చేశారు. విశాఖపట్నం నుంచి తన కారులో బంగారాన్ని తీసుకొస్తుండగా శ్రీకాకుళంలోకి రాగానే డ్రైవర్ సంతోష్‌తో పాటు ఆదిత్య డెకార్స్ యజమాని రాజు కలిసి పెదపాడు వద్ద కారుషెడ్‌లోనే దారుణంగా హత్య చేశారు. ఆగస్టు 26 నుంచి ఎడతెరిపిలేకుండా వర్షాలు కురవడం, కాలువలు, గెడ్డలు గుండా పెదపాడు పరిసర ప్రాంతమంతా అత్యధికంగా నీటి ప్రవాహం ఉండటంతో మృతదేహాన్ని పాత్రునివలస రామిగెడ్డలో పడేశారు. అక్కడి నుంచి సుమారు 4 కిలోమీటర్ల దూరం కొట్టుకుపోయి గుర్రపుడెక్కల మధ్యలో మృతదేహం చిక్కుకుపోయింది. గుప్తా వద్ద దోచుకున్న బంగారంలో సంతోష్, రాజులు ఒకరు 60శాతం, మరొకరు 40శాతం తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.


రామిగెడ్డలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అదృశ్యం ఫిర్యాదుతో..

గుప్తా కనిపించడం లేదని కుటుంబ సభ్యులు నరసన్నపేట పోలీసులను ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు నిర్వహించారు. మృతిచెంది ఉండవచ్చనే సమాచారం మేరకు శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్‌ఎఫ్, క్రైం పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి మూడు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలానికి సీఐలు పైడపునాయుడు, శ్రీనివాసరావు, ఎస్‌ఐ రాము చేరుకుని మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

పోలీసుల అదుపులో నిందితులు!

గుప్తాను హత్యచేసిన ఉదంతంలో నరసన్నపేట పోలీసులు డ్రైవర్ సంతోష్, కారు డెకార్స్ యజమాని రాజును అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శుక్రవారం మధ్యాహ్నమే పెదపాడులోని కారు డెకార్స్‌ను నరసన్నపేట, శ్రీకాకుళం పోలీసులు పరిశీలించారు. హత్య ఎలా చేశారు, హత్యకు ఉపయోగించిన ఆయుధాలు వంటివి పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కాగా, కార్ డెకార్స్ యజమాని ఓ టీడీపీ నాయకుడికి దగ్గర బంధువని సమాచారం.

లగేజీ ఆటో ఢీకొని వ్యక్తి మృతి


వెంకటరమణ మృతదేహం

వజ్రపుకొత్తూరు రూరల్: బెండి గేట్‌–కాశీబుగ్గ పాత జాతీయ రహదారిలో సరియాపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడ గ్రామానికి చెందిన కర్ని వెంకటరమణ (36) మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటరమణ పలాస మండలం పెదమాకన్నపల్లిలో ఉన్న అత్తారింటికి వెళ్లి బెండి గేట్ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వెళ్తున్న లగేజీ ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో యువకుడి ఎడమ చేయి విరిగిపోగా, తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108 వాహనంలో పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటరమణ గల్ఫ్‌లో వెల్డర్‌గా పని చేస్తూ ఆరు నెలల కిందటే ఇంటికి వచ్చాడు. భార్య ద్రాక్షవేణి, కుమారుడు లక్కీ, కుమార్తె ప్రక్షత, తల్లి రాజేశ్వరి ఉన్నారు. వెంకటరమణ మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఆమదాలవలస: మెట్టక్కివలసలోని కుప్పిలివారివీధికి చెందిన బరాటం తాతయ్యలు(51) అనుమానాస్పదంగా మృతిచెందాడు. శుక్రవారం ఆమదాలవలస ఎస్‌ఐ ఎస్.బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. తాతయ్యలు మూడు రోజులుగా ఇంటికి రాకపోవడంతో భార్య సత్యవతి ఆమదాలవలస పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంతలో శుక్రవారం పట్టణంలోని లక్ష్మీనగర్ వీధి శివారులోని శ్మశాన వాటిక షెడ్డులో మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వెళ్లి పరిశీలించగా తన భర్తేనని సత్యవతి నిర్ధారించింది. పోలీసులు అనుమానాస్పదకేసుగా దర్యాప్తు కొనసాగిస్తూ మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి శవపంచనామాకు తరలించారు.

దుబాయ్‌లో చినవంక వాసి అదృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన తన భర్త సాన రాజేష్ ఆచూకీ తెలియడం లేదని చినవంక గ్రామానికి చెందిన ఢిల్లెమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ 2015లో దుబాయ్ వెళ్లిన తన భర్త 2019 తర్వాత ఆచూకీ లేకుండా పోయారని, పదేళ్లగా ఎదురుచూస్తున్నా ఫలితం లేకపోయిందని వాపోయింది. కూలి పనులు చేసుకుంటూ కుమార్తెతో కలిసి జీవనం సాగిస్తున్నానని, అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి భర్త ఆచూకీ తెలియజేయాలని ఢిల్లెమ్మ వేడుకుంది.

నాగమణి నేత్రాలు సజీవం



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో నివాసముంటున్న తంగుడు నాగమణి(40) అనారోగ్యంతో మృతి చెందారు. మరణానంతరం ఆమె నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుటుంబసభ్యులు టి.వెంకటరావు, కె.కుమారి, బరాటం మల్లేశ్వరరావులు కొల్లు సత్యనారాయణ ద్వారా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియచేశారు. మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, నంది ఉమాశంకర్ ద్వారా నాగమణి కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు తెలియజేయాలని కోరారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ఎచ్చెర్ల : ధర్మవరంలో చల్లా రాజు (40) అనే వ్యక్తి శుక్రవారం చెరువులో పడి మృతి చెందాడు. వరిపంటకు పురుగుల మందు పిచికారీ చేయడానికి వెళ్లి వస్తూ సచివాలయం ఎదురుగా ఉన్న లంకెల కోనేరులో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో స్నానానికి దిగాడు. ఈత రాక గోతుల్లో కూరుకుపోయి మృతి చెందాడు. స్థానికులు గమనించి బయటకు తీసేటప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. రాజుకు భార్య భారతి, కుమార్తె రమ్య, కుమారుడు ఢిల్లేశ్వరరావు ఉన్నారు. భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుమందు తాగి వివాహిత ఆత్మహత్య


ఆస్పత్రిలో పూర్ణ మృతదేహం

ఆమదాలవలస: చిట్టివలస గ్రామానికి చెందిన నవిరి పూర్ణ (22) అనే వివాహిత పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమదాలవలస ఎస్‌ఐ ఎస్.బాలరాజు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమదాలవలస పట్టణంలోని ఐజేనాయుడు కాలనీకి చెందిన సాయిపల్లి మధుసూదనరావుతో పూర్ణకు నాలుగు నెలలు క్రితం వివాహం జరిగింది. కట్నం కింద రూ.5 లక్షలు, 8 తులాల బంగారం ఇచ్చారు. అయినప్పటికీ భర్త, అత్తమామలు అదనపు కట్నం తేవాలని వేధిస్తుండేవారు. ఈ బాధలు భరించలేక పూర్ణ తన తల్లిదండ్రులు నవిరి సింహాచలం, పద్మలకు సమాచారం ఇచ్చింది. వారు వచ్చి కుమార్తెను ఇంటికి తీసుకెళ్లిపోయారు. అనంతరం భర్త, అత్తమామలను పిలిపించి గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అదనపు కట్నం కోరడం తగదని చెప్పగా తాము ఇంకేమీ అడగబోమని భర్త, అత్తమామలు ఒప్పుకున్నారు. దీంతో పూర్ణ అత్తవారి ఇంటికి వెళ్లిపోయింది. మళ్లీ రెండురోజుల భర్త కొట్టడంతో పూర్ణ కన్నవారింటికి వచ్చేసింది. తల్లిదండ్రులతో కలిసి ఆగస్టు 17న భర్త వేధింపులపై ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఒత్తిడి తట్టుకోలేక సెప్టెంబర్ 2న పూర్ణ ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం పూర్ణ మృతి చెందింది. బాధితురాలి తండ్రి సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వివేకానంద తెలిపారు. పూర్ణ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జె.ఆర్.పురంలో చోరీ


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురం పంచాయతీ లక్ష్మీనగర్‌లో డేవిడ్‌రాజ్ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పాస్టర్ శ్యాంకుమార్ కుమారుడు డేవిడ్‌రాజ్, కోడలు అరుణకుమారి అద్దె ఇంట్లో ఉంటున్నారు. డేవిడ్‌రాజ్ విశాఖపట్నంలో ఒక ప్రయివేటు కంపెనీలో పని చేస్తూ రెండు రోజులుగా అక్కడే ఉండిపోయారు. కోడలు అరుణకుమారి చీపురుపల్లి మండలం నడిపిల్లిలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 3వ తేదీ రాత్రి ఇంటికి తాళం వేసి చీపురుపల్లి మండలం బొండపల్లిలోని కన్నవారింటికి వెళ్లారు. ఇదే అదనుగా గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. డేవిడ్‌రాజ్ తమ్ముడు శుక్రవారం ఉదయం 9 గంటలకు ఇంటికి వెళ్లి చూడగా తలుపులు తీసి ఉండటం గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మూడు తులాల బంగారం, రెండు లక్షల నగదు, కొన్ని వస్తువులు పోయినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఏఏపై పోలీసులకు ఫిర్యాదు

నరసన్నపేట: ఉర్లాం సచివాలయంలో పనిచేస్తున్న విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ జి.భాస్కరరావుపై నరసన్నపేట పోలీసులకు పంచాయతీ కార్యదర్శి రవికుమార్ ఫిర్యాదు చేశారు. సెప్టెంబర్ నెలకు 61 మందికి పింఛన్ పంపిణీ చేసేందుకు రూ.2.52 లక్షలు ఇవ్వగా 25 మందికి పంపిణీ చేయలేదని దీనికి సంబంధించిన మొత్తం రూ.1.17 లక్షలు ప్రభుత్వానికి కట్టాల్సి ఉండగా ఇంత వరకూ కట్టకుండా తప్పించుకు తిరుగుతున్నారని శుక్రవారం ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శిని విలేకరులు ప్రశ్నించగా ఈ మేరకు ఆయన ధ్రువీకరించారు. ఎంపీడీఓ ఆదేశాల మేరకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వీఏఏపై రైతులు కూడా ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఉర్లాంకు చెందిన రైతులకు యూరియా, డీఏపీ ఇస్తామని రైతుల వద్ద రూ.1.92 లక్షలు వసూలు చేసి తన సొంతానికి వాడుకున్న విషయం విదితమే. ఈ డబ్బు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే వీఏఏని వ్యవసాయ శాఖ సస్పెండ్ చేసింది.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలు


నారాయణపురంలో ఎలుగుబంటి సంచారం

మందస: నారాయణపురంలో శుక్రవారం ఎలుగుబంటి దాడిలో గౌరకల పాపారావు అనే వ్యక్తి గాయపడ్డాడు. తోట నుంచి వస్తుండగా ఒక్కసారిగా దాడి చేయడంతో నడుము భాగంలో గాయాలయ్యాయి. ఆ సమయంలో చేతిలో కర్ర ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రుడిని హరిపురం సీహెచ్‌సీకి తరలించారు. గ్రామాల్లో ఎలుగుబంట్ల సంచారంపై ఉద్దానం ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ఎన్నికైన డివిజన్ కమిటీల ప్రతినిధులు జేఏసీ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, వివిధ శాఖల కార్మిక రంగ సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల హామీలు అమలు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ టి.వి.ఫణి పేర్రాజు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం రెవెన్యూ భవన్‌లో జిల్లా చైర్మన్ ఎస్.శ్రీరాములు అధ్యక్షతన జిల్లా ప్రధాన కార్యదర్శి సీపాన వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన బకాయిల వివరాలను పే స్లిప్పులు, సీఎఫ్‌ఎంఎస్‌లో చూపించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఐఆర్ ప్రకటించి 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించాలని కోరారు. గ్రామ–వార్డు సచివాలయ ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ.అర్లయ్య, క్లాస్‌–4 ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ కె.ప్రవల్లిక ప్రియ, పాదిలాపు శ్రీను, వీపీఎస్ రాజు, సీపాన గోవిందరావు, జల్లేపల్లి రామారావు, ఎం.కాశీప్రసాద్ పాల్గొన్నారు.

డివిజన్ కమిటీల నియామకం..

ఏపీజేఏసీ అమరావతి సంఘం డివిజన్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాకుళం డివిజన్ చైర్మన్‌గా ఎస్.గణపతిరావు, ప్రధాన కార్యదర్శిగా పి.రాజశేఖర్, టెక్కలి డివిజన్ చైర్మన్‌గా బి.హేమసుందర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.రావు, పలాస డివిజన్ చైర్మన్‌గా బి.అప్పలస్వామి, ప్రధాన కార్యదర్శిగా పి.కుమార్, మహిళా విభాగం శ్రీకాకుళం సిటీ యూనిట్ చైర్‌పర్సన్‌గా డి.అనురాధ, ప్రధాన కార్యదర్శిగా బి.సుభద్ర, శ్రీకాకుళం డివిజన్ చైర్మన్‌గా డి.వనజాక్షి, ప్రధాన కార్యదర్శిగా పి.రాజేశ్వరి, టెక్కలి డివిజన్ చైర్మన్‌గా ఎస్.పవిత్ర, ప్రధాన కార్యదర్శిగా ఎన్.అనూష, పలాస డివిజన్ చైర్మన్‌గా ఎస్.కరుణమ్మ, ప్రధాన కార్యదర్శిగా బి.ఎస్.రాణిలను ఎన్నుకున్నారు.

ఆటో డ్రైవర్ల పొట్టకొట్టిన కూటమి ప్రభుత్వం



కొత్తూరులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఆటోడ్రైవర్లు

కొత్తూరు : కూటమి ప్రభుత్వం ఆటోడ్రైవర్ల పొట్టకొట్టిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు అన్నారు. కొత్తూరులో శుక్రవారం ఆటో డ్రైవర్లు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయడం వల్ల ఆటో డ్రైవర్లకు ఉపాధి లేకుండాపోతోందన్నారు.

ఆదాయం లేక వాహన ఈఎంఐలు చెల్లించలేక, పిల్లల ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నారా లోకేష్ గతంలో పాదయాత్ర నిర్వహించిన సమయంలో ఆటో డ్రైవర్లను అన్ని విధాలా ఆదుకుంటానిని చెప్పి ఇప్పుడు ఉపాధి లేకుండా చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆటో డ్రైవర్లకు ప్రతి నెలా కొంతమొత్తం చెల్లించడంతో పాటు వాహన మిత్ర పథకం ద్వారా ఏటా రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు, పెద్ద ఎత్తున డ్రైవర్లు పాల్గొన్నారు.